క్లుప్తంగా

ఆర్థిక సాయం



మాక్లూర్: విద్యుత్ ప్రమాదంలో కుడి చేయి కోల్పోయిన మండలంలోని రాంచంద్రపల్లికి చెందిన అన్వేష్‌కు ఆదివారం ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.10 వేల నగదు అందజేశారు. విరిగిన చేయి చికిత్స కోసం ఆసుపత్రి మొత్తం ఖర్చులు కూడా భరిస్తామని ఫౌండేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులకు తెలిపారు. నిరుపేద కుటుంబం కావటంతో అన్వేష్‌కు ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఉపాధి కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహేష్, సురేష్, శ్రీనివాస్, ఆకాష్, ప్రణీత్‌లు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వేల్పూర్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో ఆదివారం ఆర్మూర్‌కు చెందిన ఆశ్రిత ఆస్పత్రి వైద్యులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సందర్శించారు. పేదవారికి మెరుగైన వైద్యం అందించేందుకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైద్యులు గణేష్‌రెడ్డి, మానికరెడ్డి, సర్పంచ్ తీగెల రాధా మోహన్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

'వడ్డెర' భవనానికి భూమి పూజ



బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్‌లో వడ్డెర సంఘ, యాదవ సంఘ భవనాల నిర్మాణానికి ఆదివారం జెడ్పీటీసీ తలారి గంగాధర్, డీసీసీబీ డైరెక్టర్ శేఖర్ రెడ్డిలు భూమి పూజ నిర్వహించారు. భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున నిధులను మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా మంజూరుకు కృషి చేసిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బాబా, బీఆర్ఎస్ నాయకులు గోపాల్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా మండల యువమోర్చా అధ్యక్షుడిగా సుధాకర్



రుద్రూర్: మోస్రా మండల బీజేపీ యువమోర్చా కమిటీ సభ్యులను ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు స్వామి గౌడ్, బాన్సువాడ సెగ్మెంట్ కో-కన్వీనర్ భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మోస్రా మండల యువమోర్చా అధ్యక్షుడిగా సుధాకర్, ఉపాధ్యక్షుడిగా వినోద్, ప్రధాన కార్యదర్శిగా సున్నపు భూమేష్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. బీజేపీ మండల కార్యదర్శిగా వినోద్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మోస్రా ఉప సర్పంచ్ సుదర్శన్ గౌడ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కొమిరే సాయిలు, బాన్సువాడ యువమోర్చా కన్వీనర్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రాముడి గుడి నిర్మాణం



దొంకేశ్వర్(ఆర్మూర్): రాముడి గుడి కోసం ఊరికి ఊరే సంకల్పించింది. అనుకున్నదే తడవుగా కుల,మతాలకు అతీతంగా అందరూ ఏకమై చందాలు వేసుకున్నారు. దాతల సహకారం కూడా లభించడంతో ఆలయాన్ని విజయవంతంగా నిర్మించుకున్నారు కోమట్‌పల్లి గ్రామస్తులు. ఈ నెల 5వ తేదీ నుంచి నిర్వహిస్తున్న హనుమాన్ సమేత సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. అయితే, గ్రామస్తులు తలపెట్టిన రాముడి కార్యం సంపూర్ణం కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికీ చందాలు వేసుకుని, దాతల సహాయంతో సుమారు రూ.50 లక్షల వ్యయంతో రాముడి గుడిని నిర్మించుకోవడం తమ ఊరు చేసుకున్న అదృష్టమని పేర్కొంటున్నారు. చివరి రోజు విగ్రహాలతో పాటు ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం జరిపి అన్నదానం చేశారు.

ప్రతి మహిళ బీమా చేసుకోవాలి

కమ్మర్‌పల్లి: స్వయం సహాయక సంఘాల్లో ఉన్న ప్రతి మహిళ తప్పనిసరిగా బ్యాంకులో బీమా చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం కుంట గంగాధర్ కోరారు. పీఎంజేబీవై, పీఎంఎస్బీవై పథకం ద్వారా రూ.2 లక్షల ప్రమాద బీమా, రూ.2 లక్షల సాధారణ బీమా సదుపాయం ఉందన్నారు. సమీప బ్యాంకుల్లో ఈ నెల 21 నుంచి 31లోపు బీమా చేయించుకోవాలని సూచించారు.

ప్రారంభానికి నోచుకోని జీపీ భవనం

- శిథిలావస్థలో ప్రస్తుత భవనం
- ఎమ్మెల్యే రాక కోసం ఎదురుచూస్తున్న కేశాపూర్ గ్రామస్తులు



కేశాపూర్‌లో కొత్తగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయం

నిజామాబాద్ సిటీ: పరిపాలనా సౌకర్యం కోసం నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన కార్యాలయ భవనం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవటంలేదు. ప్రస్తుతం కొనసాగుతున్న భవనం శిథిలావస్థకు చేరటం, పరిపాలన పరంగా ఇబ్బందులు ఉన్నా కొత్త భవనంలోకి మారటంలేదు. నిజామాబాద్ రూరల్ మండలం కేశాపూర్ పంచాయతీ ప్రస్తుత భవనం 40 ఏళ్ల క్రితం నిర్మించారు. ఇది ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుంది. అంతేగాక మేడపై జీపీ కార్యకలాపాలు కొనసాగుతుండటంతో గ్రామంలో ఏదైన సమస్య చెప్పుకోడానికి వచ్చిన వారు ఇబ్బందులు పడుతూ బంగ్లాపైకి ఎక్కాల్సి వస్తోంది. వృద్ధులు అయితే సర్పంచ్ లేదా, పంచాయతీ కార్యదర్శికి కిందనుంచే తమ సమస్యలు చెప్పుకుని వెళ్తున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన భవనం వర్షాలకు కురుస్తుండటంతో మరమ్మతులు చేసుకుని పాలన సాగిస్తున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని కొత్త పంచాయతీ భవనం కోసం ప్రతిపాదనలు పెట్టగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

భవనం పూర్తయినా..

కేశాపూర్ గ్రామ పంచాయతీ నూతన కార్యాలయ పనులు 2017, ఏప్రిల్ 26న అప్పటి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. దీనికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.13 లక్షలు మంజూరు చేశారు. ఈ భవనం పనులు కరోనా విజృంభన సమయంలో నిలిచిపోయి ఆరు నెలల క్రితం పూర్తి అయ్యాయి. ప్రస్తుతం భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. భవనంలో సర్పంచ్, కార్యదర్శిలకు ప్రత్యేక గదులు, గ్రామసభలకు ప్రత్యేక హాల్ నిర్మించారు. రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ రాక కోసం గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

భవనం సిద్ధంగా ఉంది



గ్రామంలో కొత్తగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పూర్తి చేశాం. ప్రస్తుతం ఉన్న భవనం పాలనా పరంగా ఇబ్బందులు వస్తున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించటంతో భవనం పూర్తయింది. జీపీ భవనాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యేను కోరాం. త్వరలో వస్తానని మాట ఇచ్చారు. కొత్త భవనంలోకి మారాక గ్రామంలో నెలకొన్న సమస్యలు మరింత సులువుగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది.

– మల్లె వనిత, సర్పంచ్, కేశాపూర్

ముగిసిన బాలుర సదాచార ఆవాస శిబిరం



శిబిరంలో పాల్గొన్న విశ్రాంత ఆచార్యులు షేర్ల దయానంద్, తదితరులు

నిజామాబాద్ సిటీ: వేసవి సెలవుల్లో ఆర్యసమాజ్(ఇందూరు) ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 7 వరకు నిర్వహించిన బాలుర సదాచార ఆవాస శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గిరిరాజ్ కళాశాల వాణిజ్య విభాగ అధిపతి, విశ్రాంత ఆచార్యులు షేర్ల దయానంద్ మాట్లాడుతూ.. శిబిరంలో 12 నుంచి 25 ఏళ్ల యువకులకు ఆహార నియమాలు, ఆరోగ్య సూత్రాలు, క్రమశిక్షణతో పాటు, ధార్మిక శిక్షణ, సంస్కృత సంభాషణ వేద మంత్రాలు, యోగాసనాలు, ధ్యానం నేర్పించినట్లు, ఇవి వారి జీవితానికి పునాదిలాంటివని అన్నారు. ప్రతి భారతీయుడు దేశం కోసం, ధర్మం కోసం పాటుపడాలని అన్నారు. ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడు వినోద్‌కుమార్ గుప్త

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



వేల్పూర్‌లో పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ప్రశాంత్ రెడ్డి

వేల్పూర్: వేల్పూర్‌లో ఆదివారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన బేల్దారి, యాదవ సంఘాల సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు. వీరితో పాటు పాలెం గ్రామానికి చెందిన బీజేపీ యువజన సభ్యులు చేరారు. వీరికి మంత్రి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ జనరంజక పరిపాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు.

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో..

పెర్కిట్(ఆర్మూర్): సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమపథకాల పట్ల ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. అంకాపూర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన విశ్వబ్రాహ్మణ కులస్తులు, గొల్ల కుర్మలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్మూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీలు ఖాళీ అయ్యాయన్నారు. చేస్తున్న అభివృద్ధిని చూసి ఆర్మూర్ ప్రజలు తనకు హ్యాట్రిక్ విజయం సాధించి పెడతారని ధీమా వ్యక్తం చేశారు.

వెస్లీ చర్చిలో వేసవి తరగతులు



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దేవరాజ్

ఖలీల్‌వాడి: డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్ గ్రామంలోని వెస్లీ చర్చిలో వేసవి తరగతులు నిర్వహించినట్లు పాస్టర్ దినకరన్ తెలిపారు. ఆదివారం శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. బైబిల్ పఠనం, క్రైస్తవుల పాటలు, ఆటలు, నృత్యాలు నేర్పినట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు వచ్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు దేవరాజ్ అందజేశారు. స్వప్న, ఇందిర, సీయోను, ప్రతిమ తదితరులు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- పీయూసీ చైర్మన్ ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఆర్మూర్: అకాల వర్షాలతో తడిసిపోయిన వరి ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. ఆర్మూర్ మండలంలోని ఆలూర్ బైపాస్ రోడ్డుపై ఆరబోయగా వర్షాలకు నానిపోయిన ధాన్యాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. అకాల వర్షాలతో నేలకొరిగిన పంటలను క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రభుత్వం కాబట్టి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

పుస్తక పఠనం మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దుతుంది

ఆర్మూర్: పుస్తక పఠనం మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దుతుందని ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్‌లోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఉన్న గ్రంథాలయ భవనం మొదటి అంతస్తు నిర్మాణం పనులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎంబీ రాజేశ్వర్‌తో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రూ.42.50 లక్షలతో నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పుస్తక పఠనాన్ని ప్రతీ ఒక్కరు అలవర్చుకోవాలని అందుకు గ్రంథాలయాలు ఉపయోగపడతాయన్నారు.

పౌల్ట్రీ ఫాం ప్రారంభం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం రాంపూర్‌లో ఆదివారం పౌల్ట్రీ ఫాంను ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ప్రారంభించారు. గ్రామానికి చెందిన దయానంద్‌కు ఇటీవల దళితబంధు పథకంలో రూ.10 లక్షలు మంజూరు అయ్యాయి. పథకం ద్వారా వచ్చిన డబ్బులతో దయానంద్ గ్రామంలో పౌల్ట్రీ ఫాంను ఏర్పాటు చేసుకున్నాడు. దీంతో ఎమ్మెల్యే పౌల్ట్రీ ఫారంను ప్రారంభించారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రైస్‌మిల్లర్ల వైఖరికి నిరసనగా రాస్తారోకో



మాక్లూర్: కొనుగోలు కేంద్రం నుంచి తడిసిన ధాన్యంతో వెళ్లిన లారీలను రైస్‌మిల్లర్లు దించకుండా పక్కన పెట్టించటాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం ఏఐకేఎంఎస్ నాయకులు ఒడ్డెట్‌పల్లి గ్రామంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుడ్డు గంగాధర్ మాట్లాడుతూ.. మంత్రులు, ఎమ్మెల్యేలు ఒక వైపు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నాం.. అధైర్యపడవద్దు అంటూ రైతులకు చెబుతున్నా రైస్‌మిల్లర్లు మాత్రం తడిసిన ధాన్యంతో వెళ్లిన లారీలను దించకుండా అక్కడే నిలిపి వేస్తున్నారన్నారు. ఫలితంగా లారీల కొరతతో పాటు కాంటాలు నిలిచిపోయి ధాన్యం రాసులు కల్లాల్లో పేరుకుపోతున్నాయన్నారు. ఒక వైపు వర్షం ముంచుకొస్తుంటే మరో వైపు రైస్‌మిల్లర్లు తడిసిన ధాన్యం వద్దంటూ చెప్పటం సరైంది కాదన్నారు. ఈ విషయంపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 14 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం, తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సరిత ముఖ్య అతిథులుగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అతిథులు భారత రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ కృషిని కొనియాడారు. ఎంపీపీ పస్క నర్సయ్య, జెడ్పీటీసీ సంతోష్, ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, కౌన్సిలర్లు సంగీత రవి గౌడ్, ఆకుల రాము, కాశీరాం, మాజీ ఎంపీటీసీ రాజ గంగారాం, ఎండీ సలీం పాల్గొన్నారు.

రోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్/బాల్కొండ: మండలంలోని వివిధ గ్రామాలలో అభివృద్ధి పనులకు రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి భూమిపూజ నిర్వహించారు. జాతీయ రహదారి 63 నుంచి 44 వరకు లింకురోడ్డు పునరుద్ధరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా ఆదివారం పనులు ప్రారంభించారు. రూ.4.47 కోట్లతో బీటీ పునరుద్ధరణ, దొన్కల్ నుంచి వడ్డెర కాలనీ మీదుగా పోచంపల్లి వరకు రూ.90 లక్షలతో రోడ్డుకు మరమ్మతు పనులు, శెట్‌పల్లి నుంచి వన్నెల్ బీ వరకు రోడ్డు మరమ్మతులకు రూ.3.95 కోట్లు మంజూరు చేయగా పనులను ఆయన ప్రారంభించారు. తెలంగాణ సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ దొన్కల్ సంజీవరెడ్డి, ఎంపీపీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ తొగటి శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు బద్దం రవి, సర్పంచ్‌లు కత్తి లావణ్య, రాజేశ్వర్, బద్దం గంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ద్యావతి అశోక్, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి



కోటగల్లీలో నివాళులర్పిస్తున్న నాయకులు



గడ్కోల్‌లో నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నేతలు

సుభాష్‌నగర్: మన్యం వీరుడు, స్వాతంత్రోద్యమ గెరిల్లా పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా నగరంలోని కోటగల్లిలో గల అల్లూరి విగ్రహానికి సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో పూలమాలతో ఘన నివాళ్లర్పించారు. ఈసందర్భంగా ప్రజాపంథా జిల్లాకార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ.. అటవీ భూములపై ఆదివాసీలకే హక్కులు ఉండాలని విదేశీ, పరాయి పెత్తనాలను ధిక్కరించిన ధీశాలి అని కొనియాడారు. ఆదివాసీ, గిరిజనుల హక్కులను కాలరాస్తున్న నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను అల్లూరి స్ఫూర్తితో ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

మోపాల్:మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో గల అల్లూరి విగ్రహానికి ప్రజాసంఘాలు, వీడీసీ ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు. వీడీసీ అధ్యక్షుడు గ్యాద జనార్దన్‌రెడ్డి, సర్పంచ్ క్యాతం రవి, ఉపసర్పంచ్ ద్యాప రవి, ఎంపీటీసీ చిత్తరి ముత్యం, ప్రజాపంథా నాయకులు పాల్గొన్నారు.

సిరికొండ: గడ్కోల్ గ్రామంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి భాస్కర్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి, నారాయణ, సతీష్, గంగాదాసు పాల్గొన్నారు. సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో కూడా నివాళులర్పించారు.

ఇంకా బహిష్కరణ ఎత్తివేయలేదు



మాట్లాడుతున్న రామన్నపేట్ ముదిరాజ్‌లు

నిజామాబాద్‌నాగారం: వేల్పూర్ మండలంలోని రామన్నపేట్‌లో ముదిరాజ్‌లపై విధించిన బహిష్కరణ ఎత్తివేయాలని జిల్లా అధికారులు ఆదేశాలు ఇచ్చిన ఎత్తివేయకుండా అవమానాలకు, ఇబ్బందులకు గురి చేస్తున్నారని ముదిరాజ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం వారు ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఏప్రిల్ 7న గ్రామ బహిష్కరణ ఎత్తివేయాలని అధికారులు వచ్చి చెప్పినా లెక్క చేయడం లేదన్నారు. గ్రామంలో పనులు చేయించుకోవడం లేదని, మా దుకాణాలు తెరవద్దని, పనులకు రాకుండా అడ్డుకుంటారన్నారు. అలాగే ఎస్సీ కులస్తులతో అట్రాసిటీ కేసు పెట్టించడానికి కుట్రలు పన్నుతున్నట్లు తెలిపారు. వీడీసీ సభ్యులు కావాలనే మా మీదకు గొడవలు పెట్టేలా ఉసిగొలుపుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్, పోలీస్ అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని, వీడీసీ నుంచి రక్షణ కల్పించాలన్నారు. ముదిరాజ్ కులస్తులు గంగనర్సయ్య, భాస్కర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో 50 మంది చేరిక



సంజయ్ సమక్షంలో చేరుతున్న యువకులు

ఖలీల్‌వాడి: నగరంలోని 29వ డివిజన్‌కు చెందిన యువ నాయకుడు సోహెల్ ఆధ్వర్యంలో 50 మంది యువకులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. వీరిని మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ , కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సోహెల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులలై పార్టీలో చేరుతున్నట్లు సోహెల్ తెలిపారు.

నేడు చందూర్ మండల సర్వసభ్య సమావేశం

రుద్రూర్: చందూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ లావణ్య తెలిపారు. అతిథిగా అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరు కానున్నట్లు వెల్లడించారు. సమావేశం రైతు వేదిక భవనంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని,ప్రజాప్రతినిధులు అధికారులు సకాలంలో హాజరు కావాల్సిందిగా కోరారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,200	వెండి (కిలో)	78,000
22 క్యారెట్స్	57,350	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	4	8	క్యాప్సికం	40	60
బెండకాయ	30	50	గాజరుగడ్డ	20	30
బీరకాయ	30	50	పచ్చిమిర్చి	25	40
దొండకాయ	15	30	దోసకాయ	15	30
బీర్నీసుకాయ	60	80	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిగడ్డ	15	30
వంకాయ	25	50	గోబిపువ్వు	20	40
పాలకూర	40	60	బీట్‌రూట్	30	50
మెంతికూర	40	60	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	40	60
పుదీనా	30	50			– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)
స్క్రీన్-1- ఉగ్రం-10.30
విరూపాక్ష -1.15,10.35
రామబాణం -4.30
పొన్నియిన్ సెల్వన్-2- 7.25
స్క్రీన్-2- గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ- 10.30 ,10.20
పొన్నియిన్ సెల్వన్-2 -1.30
ఉగ్రం -4.40,7.25
స్క్రీన్-3 -రామబాణం-10.30,7.30,10.30
గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ-1.20,4.25
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1- గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ(ఇంగ్లీష్) 3.15,6.30,9.45
స్క్రీన్-2- ఉగ్రం-10.00,4.15,10.30
రామబాణం -1.10,7.25
స్క్రీన్-3-ది కేరళ స్టోరీ(హిందీ),10.00,1.00 4.00,7.00,10.00
స్క్రీన్-4- ఇంగ్లీష్ మంజు(తెలుగు) 10.00
యాదగిరి అండ్ సన్స్-1.25
అరంగేట్రం-4.00
పొన్నియిన్ సెల్వన్-2,6.50 ,10.20
దేవి — పొన్నియన్ సెల్వన్ 2
నటరాజ్ — ఉగ్రం
లలితామహల్ — రామబాణం
విజయ్ — విరూపాక్ష